పేదలకు 'పట్టా'భిషేకం

- బాలరాముడి ప్రాణప్రతిష్ఠ రోజున పట్టాలు పంపిణీ చేయడం శుభపరిణామం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నన్నూరు-2 జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో బృహత్తరమైన బాలరాముడి ప్రతిష్ఠాపన శుభ సందర్భంగా సోమవారం నన్నూరులోని గడెం తిప్పపై నూతనంగా నిర్మించిన 2వ జగనన్న కాలనీలో పెద్దెత్తున పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ముందుగా జాతీయ రహదారి పక్కన, కాలనీ ముందు భాగాన నూతనంగా ఏర్పాటు చేసిన దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే పూలమాల వేసి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన


వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పట్టాల ప్రదనోత్సవం పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కుసుమలత, హుసేనాపురం సింగిల్ విండో అధ్యక్షుడు నాగతిరుపాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు.

ఇళ్ల పట్టాలపై టీడీపీ కోర్టుకెళ్లడం దుర్మార్గమైన చర్య

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఇష్టంలేక టీడీపీ నేతలు కోర్టుకెళ్లి స్టేలుతెచ్చి అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనచర్య అని ఎమ్మెల్యే అన్నారు. అంతేగాక 2014 ఎన్నికల్లో డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులను రద్దుచేస్తామని, ఎవరూ పొదుపు రుణాలు చెల్లించ వద్దని టీడీపీ అధినేత మహిళలను నయవంచనకు గురిచేసిన విషయం మరచిపోవద్దన్నారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందజేసి పొదుపు సంఘాలకు ప్రాణం పోస్తే, 2014లో టీడీపీ ప్రభుత్వం పొదుపు రుణాలను రూ.1 వడ్డీ వసూలు చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నాయకులకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందజేసి లక్షాధికారులను చేయాలనుకుంటే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, విద్యా దీవన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకాల ద్వారా లక్షలాది మంది మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేందారని చెప్పారు. మహిళలకు మేలుచేసే ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం వుందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలలో నాల్గవ దశ వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలను అనంతపురంలో మంగళవారం బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమచేయడం జరుగుతుందన్నారు.

రూ.3కోట్లతో వంతెన ఆధునికీకరణ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నన్నూరు ప్రజల సౌలభ్యం కోసం బైపాస్ రోడ్డు వేయడం, గ్రామంలో శిథిలావస్థకు చేరిన పురాతన ఇరుకైన వంతెనను దాదాపు రూ.3 కోట్లతో ఆధునీకరించడమేగాక వెడల్పు పెంచడం జరిగిందన్నారు. గ్రామంలో 2వ జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణానికి సుమారు రూ.30 లక్షల సొంత నిధులు ఖర్చుచేసిన గ్రామనేత చెన్నారెడ్డి ఔదార్యం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాణ్యం ఎంపీపీ ఉశేన్‌బీ, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సర్పంచులు గోవర్ధన్, రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు నియోజకవర్గంలో 2,41,767 మంది ఓటర్లు

- మహిళల కంటే పురుష ఓటర్లు 347 మంది అధికం
- కొత్తగా 5433 మంది ఓటరుగా నమోదు
- పెరిగిన 15,917 మంది ఓటర్లు

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని గుడూరు, సి.బెళగల్, కర్నూలు అర్బన్, రూరల్, కోడుమూరు మండలాల పరిధిలో తుది ఓటరు జాబితాను రిటర్నింగ్ ఆఫీసర్ సోమవారం విడుదల చేశారు. దీని ప్రకారం నియోజకవర్గంలో 2,41,767 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,21,050, మహిళలు 1,20,703, ఇతరులు 14 మంది ఉన్నారు. 2023 జనవరి 1వ తేదీ నాటికి 2,25,850 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది అక్టోబరు నెలలో ఎన్నికల సంఘం జారీ చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 2,31,940 మంది ఉండగా సవరణల అనంతరం 2024 తుది ఓటరు జాబితాలో 2,41,767 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 15,917 మంది ఓటర్లు పెరిగారు. తుది ఓటరు జాబితా నాటికి మొత్తం 5433 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. మొత్తంగా నియోజకవర్గంలో పురుష ఓటర్లు, మహిళ ఓటర్ల కంటే 347 మంది ఎక్కువగా ఉన్నారు.

నియోజవర్గంలో 7,796 ఓట్లు తొలగింపు

నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలల్లో ఉన్న 275 పోలింగ్ కేంద్రాల పరిధిలో గతేడాది అక్టోబరు 27 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు 4,176 మంది ఓటర్లు చనిపోయిన వారు ఉండగా, ఇతర ప్రాంతాలకు బదలాయించిన వారు 2317 మంది, 1303 దొంగ ఓట్లను మొత్తంగా 7796 మంది ఓటర్లను జాబితాలో నుంచి తొలగించారు. అదే విధంగా ఒకే ఇంటి అడ్రసుతో 10 మందికిపైగా ఓటర్లు ఉన్న వారు 2,749 మంది ఓటర్లను గుర్తించి విచారణ చేసి సరైనవిగాను, ఇంటి అడ్రసుకు సరికాని ఇద్దరు ఓటర్లను గుర్తించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తన స్వగృహంలో పంపిణీ చేశారు. కోడుమూరు మండలం ముడుమాలగుర్తి గ్రామానికి చెందిన బోయ మల్లమారి మధుకు రూ.70 వేల రూపాయలు చెక్కును, గుడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కి మంజూరు చేసిన రూ.90 వేల చెక్కును తండ్రి మల్లికార్జునకు అందజేశారు. లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

వైభవంగా ఉత్తర ద్వార ప్రారంభోత్సవం


ఉత్తర ద్వారానికి పూజలు నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి

కోడుమూరు రూరల్ : కోడుమూరులో రూ.10 కోట్ల వ్యయంతో పునర్ నిర్మిస్తున్న పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఉత్తర ద్వారాన్ని సోమవారం హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా ప్రారంభించారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి కోడుమూరుకు విచ్చేసిన హంపి పీఠాధిపతిని స్థానిక శ్రీరాముల వారి దేవాలయం నుంచి శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీవిద్యారణ్య భారతి స్వామి ఆలయ ఉత్తర ద్వారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించడంతో పాటు, నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించి ఆలయ ప్రాముఖ్యత విశిష్టతలను తెలుసుకున్నారు. నిర్మాణంలో పాలు పంచుకుంటున్న కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులను అభినందించారు.

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పది

మన భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని శ్రీవిద్యారణ్య భారతి స్వామి అన్నారు. విదేశీయులు చాలామంది మన సంస్కృతి, ఆచారాలపై ప్రయోగాలు చేసి గొప్పతనాన్ని తెలుసుకుంటుంటుటే.. మన ప్రజలు మాత్రం పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి మన సంస్కృతిని చేజేతులా నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు, పెద్దలను గౌరవించడం తప్పనిసరిగా నేర్పాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన భక్తులు


ర్యాలీలో శ్రీసీతారామలక్ష్మణ వేషధారణలో చిన్నారులు

మారుమోగిన రామ నామం

- గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ
- భజనలు, ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలు
- బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను ఎల్‌ఈడీ స్క్రీన్లపై వీక్షించిన భక్తులు


గోరుకల్లులో సీతారాములు చిత్రపటాల ఊరేగింపు


కల్లూరులో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పాణ్యం : అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణాలు, గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మరి కొన్ని గ్రామాల్లో నిర్వహకులు ప్రజలందరు ఈ మహాఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.

పాణ్యంలో..

పాణ్యంలోని శ్రీ వీర నారాయణస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా స్క్రీన్లను ఏర్పాటు చేశారు. డొంగుల వద్ద ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నదానం చేపట్టారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీ వాల్మీకి ఆలయంలో నిర్వహకులు భజన బృందంచే ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు వడపప్పు, పానకం అందించారు. కొణిదేడు గ్రామంలోని శ్రీ రాములు ఆలయం వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. తదనంతరం స్వామివార్లకు పూజలు చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలమూరు ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భజన కార్యక్రమాలు చేపట్టారు. కోలాటం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొండజుటూరు గ్రామంలో రాములు దేవాలయాన్ని పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపనపాడు గ్రామంలో ప్రజలు జై శ్రీరామ్ అంటు జెండాలు పట్టుకొని గ్రామంలోని పురవీధుల గుండా ప్రచారం చేశారు. గోరుకల్లు గ్రామంలో సీతారాములు చిత్ర పటానికి గ్రామం పురవీధుల గుండా ఊరేగించారు. ఆలమూరులో రాత్రి వేళ్ల కొ ఌటం నిర్వహించి స్వామి వారి చిత్ర పటాలకు పూజలు చేశారు.

అన్నదానం

గడివేముల: ఆయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని సోమవారం అన్నదానం చేయడం శుభప్రదమని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గడివేములలోని వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, మూలపెద్దమ్మ ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, దేశం సంజీవరెడ్డి, సీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గని గ్రామంలోని శ్రీరామాలయంలో శ్రీసీతా రామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమనీయం..రాములోరి కల్యాణం

ఓర్వకల్లు : మండలంలోని గ్రామగ్రామానా సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. మండల కేంద్రంలోని శ్రీచెన్నకేశస్వామి దేవాలయంలో సీతారాములకు అభిషేకార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ మద్దిలేటి ఆలయ ధర్మకర్తమండలి తరుపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ముస్తాబైన ఉత్సవ మూర్తులను పురోహితులు విష్ణుశర్మ, పవన్‌కుమార్‌శర్మ, నారాయణశర్మలు కల్యాణ కట్టపై ఆశీనులను చేశారు. ఆలయ ఈఓ మద్దిలేటి దంపతులు, ఆలయ చైర్మన్ వాసుదేవరెడ్డి దంపతులు కల్యాణ పెద్దలుగా వ్యవహరించారు. అశేష భక్తజన సందోహాల మధ్య స్వాముల వారికి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అయోధ్యలో జరుగుతున్న రాముల వారి ప్రతిష్ఠోత్సవాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు ఆలయ ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కల్లూరు: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాని పురస్కరించుకుని సోమవారం కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాలోని దేవాలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్లూరులో శ్రీ రాముల వారి చిత్రపటానికి పూజలు చేసి పురవీధుల గుండా ఊరేగించారు.

గూడూరు: పట్టణంలో సోమవారం రామనామం మారుమోగింది. స్థానిక వాల్మీకి దేవాలయంలో నిర్వాహకులు ఎల్‌ఈడీ తెరపై అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయాలు

సి.బెళగల్: అయోధ్యలో శ్రీ బాల రాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని శ్రీ రాముడి ఆలయాలు కిటకిలాడాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండల కేంద్రంలోని వాల్మీకి రామాలయంలో మాజీ సర్పంచ్ సీబీ వసుందరమ్మ, గ్రామ పెద్ద, హైకోర్టు లాయర్ సీబీ రామ్మోహన్‌రెడ్డి శ్రీ సీతాలక్ష్మన్న ఆంజనేయ సమేత శ్రీరాముడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజారి సుదర్శణాచార్యులు స్వామివార్లకు పంచామృత అభిషేకాలతో ప్రత్యేక పూజలను నిర్వహించి.. పెద్దలు, భక్తులకు అక్షింతలను, అయోధ్య ఆలయ నమూన చిత్ర పటాలను పంపిణీ చేశారు. హైకోర్టు లాయర్ సీబీ రామ్మోహన్‌రెడ్డి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయంలో భక్తులు రంగుల ముగ్గులతో వేసిన సీతారాముల సుందర దృశ్యం పలువురిని ఆకట్టుకుంది. సాయంత్రం గ్రామంలో శ్రీ రాముడికి పల్లకీసేవ, చిత్రపటాలతో శోభయాత్రను నిర్వహించారు.


సి.బెళగల్‌లో శ్రీరాముడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


ఆలమూరులో భజన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు


పాణ్యంలోని దొంగు వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

కుల గణన పక్కాగా చేపట్టాలి

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. కల్లూరు గ్రామీణ ప్రాంతాల్లోని 19 గ్రామ సచివాలయాల్లో కుల గణన సర్వే సోమవారం కొనసాగింది. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే వివరాలు నమోదు చేస్తున్నారు. మండలంలో 19 గ్రామ సచివాలయాల్లో 28.52శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీఓ తెలిపారు.

వేగంగా కులగణన

పాణ్యం : ప్రభుత్వం ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేపడుతున్న కల గణన సర్వే వేగంగా సాగుతోంది. సోమవారం సచివాలయం-2 పరిధిలో గ్రామ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వలంటీర్లు సురేఖ, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

- పాణ్యం నియోజకవర్గ ఓటర్లు 3,22,494
- పురుషుల కంటే మహిళా ఓటర్లు 8,193 మంది అధికం

పాణ్యం : 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేసింది. పాణ్యం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,22,494 మంది ఉన్నారు. ఇటీవల ఎన్నికల సంఘం ముసాయిదాలను విడుదల చేయగా వాటిపై అభ్యంతరాలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న ఓటర్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది.

మహిళలే కింగ్ మేకర్లు

గడివేముల: అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. గత ఎన్నికల్లో కంటే ఈ సారి మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది. వారు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీ నాయకులు విజయవకాశాలు ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. పాణ్యం నియోజకవర్గంలో 3,22,494 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,57,113, మహిళలు 1,65,306 ఉండగా 75 మంది ఇతరుల ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పురుషుల కంటే మహిళలు 8,193 మంది ఎక్కువగా ఉన్నారు.

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పాణ్యం	17,868	19,003	22	36,893
గడివేముల	16,897	17,512	2	34,411
ఓర్వకల్లు	23,401	24,706	14	48,121
కల్లూరు	98947	104085	37	203069
మొత్తం	157113	165306	75	3,22,494

క్లుప్తంగా

అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టండి


పనులపై టీచర్లతో చర్చిస్తున్న ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు – నేడు అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని క్రిష్ణదొడ్డి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీచర్లు, ఇంజినీర్ అసిస్టెంట్ శాంతి, పీఎంసీ సభ్యులతో చర్చించి, నిధుల వినియోగంపై సూచనలు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు : మండలంలోని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024వ సంవత్సరం నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ ఓంకార్‌యాదవ్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, మండల గౌరవ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగిర్దార్, శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు గజేంద్రుడు, మద్దిలేటి, రత్నకుమార్, నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన రజక సంఘం నాయకులు


ఎమ్మెల్యేతో రజక సంఘం కార్యవర్గ సభ్యులు

కల్లూరు: పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన రజక సంఘం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. సోమవారం పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 150 కుటుంబాలు దాదాపు 500 ఓటర్లు చాకలి పెద్ద మద్దిలేటిని అధ్యక్షుడిగా, చిన్న మద్దిలేటిని ఉపాధ్యక్షుడిగా, చిన్న బుడ్డన్న కార్యదర్శిగా, మద్దిలేటి, తిరుపాలు గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సంఘం సమావేశ భవనం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

కార్యకర్తకు పరామర్శ


కృష్ణను పరామర్శిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్ : కోడుమూరులో గుడి నిర్మాణం చేపడుతుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వర్కూరు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణను సోమవారం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి పరామర్శించారు. కృష్ణకు దగ్గరుండి వైద్యం చేయించడంతో పాటు, త్వరగా కోలుకునేలా చూడాలని జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వర్‌రెడ్డిలకు కుడా చైర్మన్ కోట్ల హర్ష సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటగిరి గోపాల్‌రెడ్డి, దస్తగిరి, తోటయ్య, శేఖర్, కొలుట్లయ్య తదితరులున్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవీంద్రారెడ్డి

కోడుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25లక్షల వరకు వైద్యం పొందేలా చర్యలు తీసుకుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రవీంద్ర రెడ్డి సూచించారు. సోమవారం కోడుమూరు-1 గ్రామ సచివాలయ పరిధిలోని కాలనీల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హేమసుందరం, స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల ఉపయోగం గురించి ప్రజలకు వివరించారు. జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసమూర్తి, ఎంపీహెచ్‌ఈఓలు నరసప్ప, నివాస్, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.